

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

**రచనాకాలం: 1995 సంవత్సరం**

*(గత సంచిక తరువాయి)*

**దేశంలోని చిన్నా,** పెద్ద దినపత్రికల్లో అధికభాగం వాణి న్యూస్‌ని ప్రచురించాయి. రెయిటర్స్ న్యూస్ సర్వీస్ మొదటగా ఆ న్యూస్‌ని కేచ్ చేసి తమ సబ్‌స్క్రైబర్స్ దినపత్రికలన్నింటికీ పంపడంతో అది జరిగింది.

వివిధ దినపత్రికలనించి వెంకటేశ్వరరావు,లక్ష్మిలని ఇంటర్వ్యూ చేయడానికి దాదాపు డజనుమంది విలేఖరులు వచ్చారు. ఎవరితోనూ మాట్లాడటానికి లక్ష్మి, వెంకటేశ్వరరావులు ఇష్టపడలేదు. అయితే వాణి మాత్రం అందరికీ ఇంటర్వ్యూనిచ్చింది. తన గురించి ప్రజలకి ఎంత ఎక్కువగా తెలిస్తే అంత మంచిదన్నది ఆమె అభిప్రాయం.

'సియాటిల్ టైమ్స్' నించి వచ్చిన రిపోర్టర్ అడిగాడు.

"అమెరికన్ అధ్యక్షుణ్ణి బెదిరించి, పోరాటం సాగించి గెలవగలరనేనా మీ ధీమా?"

"బెదిరింపు, పోరాటం అన్న పదాలని నేను అంగీకరించను. ప్రెసిడెంట్ ఎంత బిజీ వ్యక్తో నాకు తెలుసు. నా కేసుని ఆయన పరిశీలించడానికి నన్ను నేను త్యాగం చేసుకుంటున్నాను. ప్రెసిడెంట్‌కూడా కుటుంబ సభ్యులున్న మనిషే కాబట్టి ఆ విధంగా ఆయన నాకు తగిన న్యాయం చేకూరుస్తారన్న ఆశతో నేను ఆ లేఖ బిల్ క్లింటన్‌కి రాశాను తప్ప మరే ఉద్దేశంతోనూ కాదు."

"ముకుందం గడువులోగా అమెరికాకి రాకపోతే?"

"మరుక్షణం నించి నా వ్యర్థ జీవితాన్ని కేపిటల్ హిల్ మెట్లమీద గడుపుతాను. ప్రజలకి సేవ చేయడానికి ఏర్పడ్డ కేపిటల్ నా విషయంలో చేసిన అన్యాయానికి నిరసన మాత్రమే అది."

"ఇలా ప్రతి ఒక్కరూ మీ మార్గాన్ని అనుసరిస్తే ఆ మెట్లమీద చోటే వుండదుగా?"

"ఈ మార్గాన్ని అనుసరించడానికి ఎంతో మనోధైర్యం కావాలి. కేపిటల్ హిల్ మెట్లు నిండిపోయేంత మందిలో అలాంటి ధైర్యం ఉంటుందని నేననుకోను."

సి.టి.ఎన్.కి ఇచ్చిన ఇంటర్వ్యూ ఇలా సాగింది. "మీరు దేనికోసం ఈ పోరాటం సాగిస్తున్నారు?"

"అమెరికన్ సిటిజన్‌గా నా హక్కు కోసం, నా ఫియాన్స్‌ని రప్పించుకోడానికి చట్టం నా కిచ్చిన హక్కు కోసం."

"ఇప్పటికే అమెరికాకి ఇమ్మిగ్రెంట్స్ అధికం అయ్యారన్న విషయం మీరు ఒప్పుకుంటారా?"

"ఒప్పుకోను. అమెరికా ఇప్పుడు ఇక్కడున్న ఇల్లీగల్ ఇమ్మిగ్రెంట్స్‌ని భరించగలుగుతుంది. వాళ్ళు లీగల్ అయితే గంటకి పదిడాలర్ల చొప్పున పనిచేసేవారు. ఇల్లీగల్ కాబట్టి గంటకి అయిదు డాలర్లకి పనిచేసి జీవిస్తున్నారు తప్ప, ఆకలికి మాడి మరణించలేదే? దానర్థం ఏమిటి? అమెరికాకి మనుషుల అవసరం ఇంకా వుంది. అలా ఉన్నంతకాలం మనుషులు లీగల్‌గానో, ఇల్లీగల్‌గానో ఇక్కడికి వస్తూనే

ఉంటారు. ఎప్పుడయితే ఇక్కడికి వచ్చి బ్రతకలేమనుకుంటారో ఆనాడే వున్న వాళ్ళు వెనుదిరుగుతారు. కొత్తవాళ్ళు రారు. లా ఆఫ్ డిమాండ్ అండ్ సప్లయ్‌యే ఏ దేశానికయినా జనాభా విషయంలో వర్తిస్తుంది."

"అంటే ఇల్లీగల్‌గా అమెరికాకి రావడాన్ని మీరు సమర్థిస్తున్నారా?"

"ఎంతమాత్రం లేదు. ఇక్కడ ఇంకా ఇమ్మిగ్రేంట్స్ అవసరం వుందన్నమాటే చెప్తున్నాను. ఇటీవల అమెరికా జనాభా ఎంతో తెలుసా? నవంబర్ 1993కి రెండువందల అరవై మిలియన్స్ (26 కోట్లు) అమెరికాలో నివసించే వాళ్ళని, ఓ సింగిల్ లైన్‌లో నిలబెడితే ఆ లైన్ పొడవు లక్షా నలభై ఎనిమిది వేల మైళ్ళ దూరం వుంటుంది అంటే అది భూమి చుట్టుకొలతకి దాదాపు ఆరు రెట్లన్న మాట. వారానికి సగటున అమెరికన్ జనాభా యాభయ్ రెండు వేలు పెరుగుతోంది అంటే గంటకి మూడు వందల పదిమంది ఒకే ఒక్క వ్యక్తి ముకుందం అనబడే ఒకే ఒక్క వ్యక్తి అమెరికాకి భారం అవుతాడని మీరనుకుంటున్నారా?" టీవీ కెమెరాలోకి చూస్తూ అమెరికన్స్‌ని ఉద్దేశించి అడిగింది వాణి.

ఆ ప్రశ్నతో ఆ ఇంటర్వ్యూను ముగించి కామెంటేటర్ చెప్పాడు.

"వెల్ ఫోక్స్. మేం చెక్ చేశాం. ఆ స్టాటిస్టిక్స్ కరెక్టే, వాణి ఓ ఆసక్తికరమయిన ప్రశ్న వేసింది. ముకుందం అనబడే ఒకే ఒక వ్యక్తి అమెరికాకి భారం కాదని మీరు నిర్ణయిస్తే వైట్ హౌస్‌కి పోస్ట్‌కార్డ్ ద్వారా ఆ విషయం ఎందుకు తెలియచేయరు? వాణికి సహాయం చేయండి."

"ఇన్ క్రెడిబుల్! అన్ బిలీవబుల్, దటీజ్ వాణి" అరిచింది టీవీ సెట్‌ముందు కూర్చుని ప్రోగ్రాం చూసిన జూడీ.

"ఎస్. షి ఈజ్ అవర్ డియర్ వాణి" చెప్పింది జూడీ తల్లి.

జూడీ వెంటనే రిసీవర్ అందుకుని సినోజేలోని వాణి ఇంటి నంబర్‌కి డయల్ చేసింది. అరగంట ప్రయత్నించాక దొరికిందా నంబర్.

"హాయ్ వాణీ! దిసీజ్ జూడీ. ఐ జస్ట్ వాచ్డ్ యూ ఆన్ టీవీ ఎ లిటిల్ వైల్ ఎగో" ఎక్జయిటింగ్‌గా చెప్పింది జూడి.

ఇద్దరూ కొద్దిసేపు ముకుందం 'కె' వీసా మీద అమెరికా రావడం గురించి మాట్లాడుకున్నాక చెప్పింది జూడీ.

"ఐ విల్ సెండ్ ఏ పోస్ట్ కార్డ్ టు బిల్ ఆస్కింగ్ హిమ్ టు గెట్ ముకుందం అండ్ ఐ విల్ ఆర్గనైజ్ అదర్స్ టు డు ది సేమ్."

ఒక్క జూడీనే కాదు. వేలాది అమెరికన్స్ వైట్ హౌస్‌కి వాణికి న్యాయం చేకూర్చాలని ప్రెసిడెంట్‌ని కోరుతూ పోస్ట్ కార్డ్స్, లెటర్స్ టెలిగ్రామ్‌లు పంపసాగారు.

అందుకు వాణి తన కేస్‌ని టీవీ దినపత్రికల ఇంటర్వ్యూలలో చక్కగా ప్రెజెంట్ చేయడం ప్రధాన కారణం.

ఓ టీవీ ఇంటర్వ్యూలో చెప్పింది... "యునైటెడ్ నేషన్స్ సర్వేప్రకారం గతంలోకన్నా ఇప్పుడు ఎక్కువ మంది తమ స్వదేశాన్ని వదిలి విదేశాలకి వెళుతున్నారు. ప్రపంచంలోని వంద మిలియన్ జనాభా (పదికోట్ల మంది) తాము పుట్టిన దేశంలోకాక పరాయి దేశంలో జీవిస్తున్నారు. అయితే అంతా అనుకున్నట్లుగా ఎక్కువ మంది అమెరికా, వెస్టర్న్ యూరప్‌లలోని దేశాల్లో కాకుండా థర్డ్ వర్ల్డ్‌లోని అభివృద్ధి చెందుతున్న దేశాలకి వలస వెళుతున్నారు. ఏషియా నుంచి అమెరికాకి వలస రావడం సహజం. ఎందుకంటే ప్రపంచంలో కేవలం వందమందే వుంటేణ ప్రపంచ జనాభా ఇప్పుడున్న రేషియోలో వుంటే, ఆ వందమందిలో యాభయ్ తొమ్మిది మంది ఏషియన్స్. పన్నెండు మంది ఆఫ్రికన్స్ అయివుంటారు. ఆ వందలో కేవలం అయిదుగురే అమెరికన్స్. ఆ వంద మందిలో డెబ్బై మంది చదువురానివరు. యాభయ్‌మంది సమతులాహారం లేనివారు వుండటం షాకింగ్ కాదా?

"తన భర్త సమక్షంలో ఓ భార్య తమ వెడ్డింగ్ ఫోటోలోంచి తన ఫోటోని చింపగలదా? అలా చింపితే ఎలా ఫీలవుతారు ఆ ఇద్దరూ?

"భార్యాభర్తలు ఒకే ఊళ్ళో ఉద్యోగం చేస్తూ వేరే వేరే ఇళ్ళల్లో ఓ నెలరోజులు ఉండగలరా? అలా చేస్తే వాళ్ళ మానసిక బాధ ఎంత ఉంటుందో దానికి వందరెట్లు బాధని అనుభవిస్తున్నాను, నేను ప్రేమించే ముకుందం నాకు దూరం అవచ్చని, ప్లీజ్ స్టెప్ ఇన్ టు మై షూస్ అండ్ ఫీల్ వాట్ ఐ ఫీల్. అప్పుడు మీకే నా వేదన అర్థం అవుతుంది."

ఇమ్మిగ్రేషన్ చట్టం మీద ఓ దినపత్రిక రిపోర్టర్ వేసిన ప్రశ్నకి సమాధానంగా చెప్పింది వాణి.

"అనేక మంది మేధావులు అన్ని కోణాలు నుంచీ ఆలోచించి ఏర్పాటు చేసిన ఇమ్మిగ్రేషన్ చట్టం మీద కామెంట్ చేసేంత శక్తి నాకులేదు. కానీ ఒకటి మాత్రం చెప్పగలను. వాళ్ళు మానవత్వపు ఏంగిల్‌ని విస్మరించారు. ఉదాహరణకి మా అక్కయ్యకి వివాహం అయింది. ఆమె భర్త ఇండియాలో వున్నాడు. న్యూమెరికల్ ఆర్డర్‌లో ఆయన అవకాశం వచ్చేదాకా ఇక్కడికి వచ్చి తన భార్యతో కలిసి జీవించలేడు. కనీసం ఓసారి తన భార్యని చూసి వెళదామని విజిటర్స్ వీసాకోసం వెళ్ళినా అది గ్రాంట్ చెయ్యరు. ఆయన తన జీవిత కాలంలో తప్పకుండా అమెరికాకి వచ్చే అవకాశం ఉన్నప్పుడు నాన్ ఇమ్మిగ్రెంట్‌గా వచ్చే అవకాశాన్ని ఎందుకు కల్పించరు? ఆయన వంతు వచ్చినప్పుడే ఇక్కడవున్నా ఇండియాలో వున్నా ఇమ్మిగ్రెంట్ అయ్యేది. అంతదాకా నాన్ ఇమ్మిగ్రెంట్‌గా తన భార్యతో అమెరికాలో జీవించే హక్కు అవకాశం అతనిమి మన ఇమ్మిగ్రేషన్ లా ఎందుకు ఇవ్వదు? రోజూ కొన్ని లక్షలమంది అమెరికాకి విజిటర్స్‌గానో, బిజినెస్ పనిమీదో, స్టూడెంట్స్‌గానో వస్తున్నారు. అంతమందికి అవకాశం కల్పించిన అమెరికన్ చట్టం తన స్వంత భార్య దగ్గరికి ఆమె భర్త రావడానికి ఎందుకు అడ్డుపడాలి? సౌకర్యంగా మీ లివింగ్ రూంలో కూర్చుని మీ భార్య భుజం చుట్టూ చేతిని వేసి టీవీ చూస్తున్న మీరు ఒక్కసారి ఊహించండి, మీ భార్య వేరే దేశంలో ఉండి, మీరు ఆమెని చూడటానికి నాలుగైదు ఏళ్ళపాటు అనుమతి లభించకపోతే మీరెలా ఫీలవుతారో, అమెరికా బయట కొన్ని లక్షలమంది అలా ఫీలయ్యే వాళ్ళున్నారు. తమ లైఫ్ పార్టనర్‌ని చూడటానికి రావడాన్ని అనుమతించే మంచి రోజు అమెరికన్ వలస విధానం తెస్తుందని ఆశిస్తాను."

ఆ ఇంటర్వ్యూ చదివిన వాణి అక్క గద్గద కంఠంతో చెప్పింది. వాణి చేతిని అందుకుని "నువ్వు మేధావినే"

అమెరికా ప్రజల్లో చైతన్యం ఎక్కువ. ఏ వార్తకయినా తేలిగ్గా వాళ్ళు స్పందిస్తారు. ఆ స్పందనని క్రియారూపంలోకి అనువదిస్తారు.

'ఏ బి గ్రూప్ రక్తంగల ఓ వ్యక్తి చావు బతుకుల్లో ఉన్నాడు. రక్తదానం చేసి అతన్ని బతికించండి' అన్న ఎస్ ఓ ఎస్‌కి కొన్ని వందల మంది న్యూయార్క్‌లోని ఓ హాస్పిటల్‌కి రక్తదానం కోసం వెళ్ళిన దేశం అమెరికా.

వాణి వార్తలోని హ్యూమన్ ఎలిమెంట్‌ని టీవీ దినపత్రిక మీడియాలు సమర్ధవంతంగా అమెరికన్ ప్రజలకి ప్రెజెంట్ చేశాయి.

కౌంట్ డౌన్ ఎలిమెంట్ వున్న వార్త కాబట్టి, ఆ డెడ్‌లైన్ సమీపిస్తున్న కొద్దీ ఆ వార్తకి ప్రాముఖ్యం పెరగసాగింది.

ముకుందం అమెరికాకి వచ్చేలా చూసి వాణికి సహాయం చేయమన్న లెటర్స్ ద్వారా, ఫోన్ కాల్స్ ద్వారా చైతన్యవంతమయిన అమెరికన్ ప్రజల స్పందన వైట్ హౌస్‌కి అందసాగింది. తమ సెనేటర్స్‌కి కూడా చాలామంది లెటర్స్ రాయసాగారు. వాణికి సహాయం చేయమని ఫోన్ చేసి చెప్పసాగారు.

తాము ప్రేమికులని విడదీసే విలన్స్‌గా పబ్లిక్ దృష్టిలో మిగిలిపోతున్నామని గ్రహించిన లక్ష్మి భర్తతో చెప్పింది.

"నాకిదంతా ఇరిటేటింగ్‌గా వుంది. ముకుందం ఏనాడు వస్తే ఆ రోజే వాణికిచ్చి పెళ్ళి చేస్తామని రిపోర్టర్స్‌కి చెప్పండి."

వెంకటేశ్వరరావు చివరికి విలేఖరులని కలవడానికి అంగీకరించాడు. ఓ హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో కిక్కిరిసిన విలేఖరుల ముందు వెంకటేశ్వరరావు ముందు రాసుకున్న కాగితాన్ని బయటికి చదివాడు దాని సారాంశం తను, వాణితో చేసుకున్న ఒప్పందానికి తను కట్టుబడి వుంటానని, మరో మూడు రోజుల్లో ముకుందం అమెరికాకి చేరుకోలేకపోతే తను కుదిర్చిన సంబంధం వాణి చేసుకుని

తీరాలని, లేదా తను వాణిని కూతురుగా డిస్ ఓన్' చేస్తానని దాని సారాంశం. యింట్లో టీవీలో ఆ కార్యక్రమం చూసి లక్ష్మి షాక్ అయింది. ఆ స్టేట్‌మెంట్‌కి.

"ఇదన్యాయం కాదా?" అడిగాడు ఓ విలేఖరి వెంకటేశ్వరరావుని. "ఎంతమాత్రం కాదు. వాణి నా కూతురు. దాని పట్టుదల నానుంచి వారసత్వంగా వచ్చింది. తగ్గితే తను తగ్గాలి కానీ నేను మాత్రం నా పట్టుదలని వదులుకోను. నా కుటుంబ సంప్రదాయాలకి నేను బద్ధుడ్ని" నిష్కర్షగా చెప్పాడు వెంకటేశ్వరరావు.

వాణితో ఆ సంగతి చెబితే ఆమె "ముకుందం రాని పక్షంలో నేనేం చేయదలచుకున్నానో చాలాసార్లు చెప్పాను" అన్నది.

"ఆడపిల్లవి. ఒంటరిగా అలా పబ్లిక్ ప్లేస్‌లో జీవిస్తే జరగరానిది జరగగలదన్న భయంలేదా? ఏ డ్రగ్ అడిక్ట్ కన్నో మీమీద పడితే?" అడిగాడో విలేఖరి.

"అమెరికాలోని అత్యున్నత స్థానం అయిన కాంగ్రెస్ ప్రాపర్టీలో అలాంటిదేదయినా జరిగితే అది అమెరికకి, 'అంకుల్ సామ్'కి అవమానకరమయిన సంఘటనగా మీరు ప్రపంచానికి తెలియచేయండి" స్థిరంగా చెప్పింది వాణి.

ఎంతో టెన్స్‌గా ఫీలవుతున్న వాణికి ముకుందం నించి వచ్చిన ఆ ఒక్క వాక్యం ఎంతో సంతోషాన్నిచ్చింది.

*"డియర్ వాణీ!*

నీ కళ్ళు మీ అమ్మపోలికే అయితే మీ డేడీ ఆమెనే ఎందుకు పెళ్ళిచేసుకున్నారో అర్థం చేసుకోగలను.

*లవ్,*

*ముకుందం.*

## 26

ఉపగ్రహంద్వారా ఫాక్స్‌లు, ఐ.ఎస్.టి.డి.లు, టీవీ ప్రసారాలు ప్రపంచాన్ని ఎంతో చిన్నది చేయడంతో అమెరికాలో ఫ్రంట్‌పేజ్ న్యూస్ ఐటం అయిన వాణి ఉదంతాన్ని ఇండియాలోని అన్ని దినపత్రికలూ ప్రముఖంగా ప్రచురించాయి. 'ఇండియా అబ్రాడ్ న్యూస్ ఏజెన్సీ' అన్ని భాషల్లోని దినపత్రికలకు ఈ వార్తను వివరంగా అందించింది.

'ఆంధ్రప్రభ' దినపత్రికలో ఆ వార్తని చదివితే విషయాలన్నీ ముకుందానికి పూర్తిగా తెలిశాయి. ఫోన్‌లో క్లుప్తంగా వాణి చెప్పిన దానికన్నా ఎక్కువ వివరాలు తెలియడమే కాక, వాణి ఫోటో, తన ఫోటో కూడా ఆ న్యూస్ ఐటమ్‌లో చోటు చేసుకోవడం ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

మర్నాడు 'హిందూ' రిపోర్టర్ ముకుందం ఇంటికి వచ్చాడు.

"మా పరిచయం ప్రేమలోకి ఎలా దారితీసిందంటే చెప్పలేను. ఎప్పుడు నాకు ఆమె మీద ప్రేమ కలిగిందో కూడా తెలియదు" చెప్పాడు.

తర్వాత స్టూడెంట్ వీసా తనకు ఎందుకు రిజెక్ట్ అయిందో వివరించాడు. ఆ విషయం అమెరికన్ పేపర్లలో రాలేదు. వాణి కానీ వెంకటేశ్వరరావు కానీ ఆ విషయాలు చెప్పకపోవడంతో.

మర్నాడు హిందూలో ముకుందంతో జరిగిన ఇంటర్వ్యూకి పెట్టిన హెడ్డింగ్.

"యంగ్ లవర్స్ ఫైట్ విత్ అంకుల్ సామ్."

ఆ దినపత్రికలోనే 'హూ ఈజ్ అంకుల్ సామ్' అన్న హెడ్డింగ్ కింద బాక్స్ ఐటమ్‌లో ఈ వివరాలిచ్చారు.

అంకుల్ సామ్ పాపులర్ యు ఎస్ సింబల్ కార్టూన్ బొమ్మతో ఇది అసోసియేట్ అయి వుంటుంది. తెల్లటి పొడుగాటి జుట్టు, బుగ్గమీసాలు, కోట్ వెస్ట్, నక్షత్రం బొమ్మ వున్న పొడుగాటి టోపీ, స్ట్రయిప్స్ గల పంట్లాం. ఈ అపీరెన్స్ అమెరికన్ ఫోక్‌లర్‌లోని ఇద్దరు సింబాలిక్ ఫిగర్స్ అయిన బ్రదర్ జోనాథన్, యాంకీ డూడుల్ నుంచి తీసుకున్నారు.

'అంకుల్ సామ్' అన్న పదం ఎలా పుట్టింది అన్న విషయం మీద భిన్నాభిప్రాయాలున్నాయి. న్యూయార్క్ రాష్ట్రంలోని ట్రాయ్ అనే ఊళ్ళోని వ్యాపారస్థుడు సేమ్యూల్ విల్‌సన్ నుంచి దీన్ని తీసుకున్నారని ఓ అభిప్రాయం.

అతన్ని న్యూయార్క్ న్యూజెర్సీ రాష్ట్రాలకి, యు.ఎస్ ఆర్మీకి 'ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ప్రావిషన్స్'గా నియమించారు. అతనిలోని నిజాయితీ, కామన్ సెన్స్‌లవల్ల అక్టోబర్ 2, 1812న ట్రాయ్ నగరంలోని ఆ ప్లాంట్‌ని గవర్నర్ డేనియల్ టాంప్‌కిన్స్ సందర్శించినప్పుడూ బేరల్స్‌మీద వున్న ఇనిషియల్స్ 'EA -US'లను చూసి వాటి అర్థం ఏమిటని అడిగాడు. ఓ ఉద్యోగి 'EA' ఎల్‌బర్ట్ ఏండర్‌సన్ ఇనిషియల్స్ అని, అతను విల్‌సన్ పనిచేసే కాంట్రాక్టర్ అని చెప్పాడు. యు.ఎస్ అర్థం యునైటెడ్ స్టేట్స్ అయినా ఆ ఉద్యోగి జోక్‌గా అంకుల్ సామ్ అని చెప్పాడు. ఓ ఐ విట్‌నేస్ ద్వార ఈ విషయాన్ని తెలుసుకున్న పోస్ట్ మాస్టర్ థియోడరస్ బెయిలి న్యూయార్క్ గెజిట్‌లో జనరల్ ఎడ్వర్‌టైజర్‌లో మే 12 1880న ఈ విషయం ప్రకటించాడు. సామ్యూల్ విల్‌సన్ నిజాయితీకీ, దేశభక్తికీ పెట్టింది పేరు కాబట్టి త్వరలోనే అంకుల్ సామ్ పదం అమెరికన్ ప్రభుత్వానికి నిక్‌నేమ్‌గా పాపులర్ అయింది. 1961లో యు.ఎస్ కాంగ్రెస్ విల్‌సన్ ద్వారా అంకుల్ సామ్ నేషనల్ సింబల్ అయినట్లుగా ఓ రిజల్యూషన్ పాస్ చేసింది.

1830 నుంచి 1861 ద్వారా అమెరికన్ కార్టూనిస్ట్‌లు అమెరికన్ ప్రభుత్వం మీద వేసే కార్టూన్లలో అంకుల్ సామ్‌ని బొమ్మ రూపంలో చేసి పాపులర్ చేశారు. బ్రిటిష్ హాస్య పత్రిక 'పంచ్' ద్వారా టాప్ హేట్, స్ట్రయిప్డ్ ట్రోజర్స్, మీసాలు గల నేటి మోడ్రన్ అంకుల్ సామ్ బొమ్మను పాపులర్ చేశారు. అమెరికన్ ప్రభుత్వం కూడా ఈ బొమ్మని మొదటి రెండో ప్రపంచ యుద్ధాల్లో అమెరికన్ సైన్యంలో చేరడానికి రిక్రూటింగ్ పోస్టర్‌లలో అంకుల్ సామ్ బొమ్మ వుంది. జేమ్స్ మాంట్‌నోమరి ఫాక్ ఈ పోస్టర్‌లను డిజైన్ చేయడమేకాక, తనే అంకుల్ సామ్‌కి మోడల్‌గా పనిచేశాడు.

క్రానికల్‌కి ముకుందం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇలా చెప్పాడు.

"అమెరికాలోని స్టేచ్యు ఆఫ్ లిబర్టీ మొహం యూరప్ వైపు వెనక భాగం ఏషియా వైపు ఎందుకుందో ఇప్పుడు నాకర్థం అవుతుంది. అక్కడ ఏషియన్స్‌ని దూరంగా వుంచుతారు."

ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లోని వార్తలో మిగతా దినపత్రికలేవీరాయని ఓ కొత్త విషయాన్ని ప్రచురించారు.

"ఇంక వాణి తండ్రి వెంకటేశ్వరరావు పెట్టిన గడువుకి కౌంట్ డౌన్ మూడురోజులే వుంది. ఆ గడువులోగా ముకుందం అమెరికా బార్డర్ దాటాలంటే, రేపు అతను అమెరికాకి బయలుదేరాలి. అక్కడికి మద్రాసు నుంచి ప్రయాణం 23 గంటలు. అంటే ఇవాళ ముకుందానికి మద్రాసులో వీసా మంజూరు అవ్వాలి. వీసా కోసం ఆఖరి ప్రయత్నం చేయడానికి ముకుందం నిన్నరాత్రి రాజమండ్రి నుంచి బయలుదేరి ఇవాళ మద్రాసులోని అమెరికన్ కన్స్‌లేట్‌కి వెళుతున్నాడు అని మా రాజమండ్రి ప్రతినిధి తెలియజేశారు."

*(ముగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in

Post your comments